గణతంత్ర దినోత్సవ వేడుకల రిహార్సల్స్‌లో పాల్గొన్న ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్

ఆంధ్రప్రదేశ్‌పై బిజెపి కుట్ర

అభివాదం చేస్తున్న విద్యార్థి యువజన సంఘాలు, ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు

- ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం
- అన్ని విధాలా అభివృద్ధిని అడ్డుకుంటున్న కేంద్రం
- హోదా పోరాటంలో అన్ని పార్టీలూ కలిసి రావాలి
- ఇది భవిష్యత్తు తరాల కోసం సాగిస్తున్న ఉద్యమం
- ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్
- అనంత నుంచి ప్రత్యేక హోదా బస్సు యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేసేలా బిజెపి భయంకరమైన కుట్ర చేస్తోందని విద్యార్థి, యువజన, ప్రత్యేక హోదా సాధన సమితి, ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు చేపట్టిన బస్సుయాత్ర బుధవారం నాడు అనంతపురం నగరంలో ప్రారంభం అయ్యింది. ముందుగా నగరంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అక్కడి నుంచి పివికెకె కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. కళాశాలలో ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు ఓతురు పరమేష్, చిరంజీవి అధ్యక్షతన మహాసభ నిర్వహించారు. అనంతరం బస్సుయాత్రను ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలఓ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర నాయకుడు జి.ఓబులు, పశ్చిమ రాయలసీమ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు మేనల్లుడు సత్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సిపిఐ రాష్ట్ర నాయకులు జగదీష్, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న పాటు విద్యార్థి, యువజన సంఘం నాయకులు పెద్ద ఎత్తున ఇందులో పాల్గొన్నారు.

రాష్ట్రానికి తీరని అన్యాయం : చలసాని

ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యేక హోదా ఇవ్వకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ పేర్కొన్నారు. విభజన హామీలను అమలు చేయకుండా అడుగడుగునా రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి ఎన్నికల ముందు ఒక మాట, ఎన్నికల తరువాత మరో మాట చెప్పి రాష్ట్రానికి ద్రోహం చేస్తోందన్నారు. బిజెపి చేస్తున్న ఈ అన్యాయాన్ని ప్రతి ఒక్కరూ ప్రశ్నించాలన్నారు. ప్రత్యేక హోదా ఉద్యమం వ్యక్తుల కోసం కాదని, ఇది విద్యార్థి, యువజనులు, ప్రజల భవిష్యత్తుకు సంబంధించినది అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రత్యేక హోదా ఉద్యమంలో పాలుపంచుకోవాలన్నారు. అనంతపురంలో ప్రారంభం అయిన బస్సుయాత్ర ఇచ్ఛాపురం వరకు కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్రానికి బిజెపి చేస్తున్న మోసాన్ని ఈ యాత్ర ద్వారా ప్రజలకు వివరిస్తామని తెలియజేశారు.

ముఖ్యమంత్రి, వైసిపి ఎంపీలు ఏం చేస్తున్నారు.. : రామకృష్ణ

ప్రత్యేక హోదా విభజన హామీలు అమలు చేయకుండా బిజెపి మోసం చేస్తున్నా దానిని ప్రశ్నించకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, వైసిపి ఎంపీలు ఏం చేస్తున్నారంటూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రశ్నించారు. బిజెపి అధికారం చేపట్టి ఎనిమిదేళ్లు పూర్తయినా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. ప్రజలకు మేలు చేయకుండా ఏపీలో తమని గెలిపించాలని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు కోరడం సిగ్గుచేటన్నారు. సోము వీర్రాజుకు సిగ్గుంటే బిజెపి రాష్ట్రానికి ఏమిచేసిందో చెప్పాలన్నారు. ఇక రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి బిజెపికి భయపడి ప్రత్యేక హోదాపై మాట్లాడుకుండా మౌనంగా ఉందన్నారు. 25 మంది ఎంపీలను గెలిపిస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానని చెప్పిన జగన్మోహన్‌రెడ్డికి ప్రజలు 31 మంది ఎంపీలను ఇస్తే ఇప్పుడు ఏమీ చేయలేక గాడిదలు కాస్తున్నాడా అని ప్రశ్నించారు. వైసీపీ ఎంపీలందరూ ప్రత్యేక హోదా గురించి మాట్లాడకుండా పార్లమెంట్‌లో నిద్రపోతున్నారంటూ ఎద్దేవా చేశారు. వైసిపి ఎంపీలు చేతగాని దద్దమ్మల్లా ఉంటూ రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోపాటు రాయలసీమ ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని విద్యార్థి యువజన సంఘాలు చేపట్టిన సమరయాత్రకు సిపిఐ పూర్తిగా మద్దతుగా ఉంటుందని తెలియజేశారు.

ప్రత్యేక హోదాతోనే మన భవిష్యత్తు
సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు

అడ్డగోలుగా విభజించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు తెలిపారు. విభజన హామీలు అమలు చేయకుండా మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి దగా చేసిందన్నారు. వెనుకబడిన ప్రాంతానికి పరిశ్రమలు రావాలన్న, ఉద్యోగ ఉపాధి అవకాశాలు రావాలన్న ప్రత్యేక హోదా ఇస్తేనే సాధ్యమవుతుందని చెప్పారు. జాతీయ సంస్థలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఏర్పాటు చేయలేదన్నారు. సెంట్రల్ యూనివర్శిటీకి 8 సంవత్సరాలు కావస్తున్న ప్రహరీ కూడా కట్టని దౌర్భాగ్య స్థితి ఉందన్నారు. రాష్ట్రం పట్ల మోదీ ప్రభుత్వం వివక్ష చూపుతుంటే రాష్ట్ర ప్రభుత్వం సాగిలపడి వ్యవహరించడం మరింత నష్టం కలిగిస్తోందన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

హోదాతోనే రాష్ట్ర అభివృద్ధి
పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు.

రాష్ట్రానికి హోదా ఇస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు తెలిపారు. పేదరిక నిర్మూలనకు, యువత, విద్యార్థులకు విద్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాల కోసం ఎపికి ప్రత్యేక హోదా కల్పిస్తున్నట్లు నాటి ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. విభజనకు సహకరించి బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం విద్యార్థి యువజన సంఘాలు చేస్తున్న పోరాటాల్లో అందరూ భాగస్వామ్యులు కావాలని కోరారు.

ఓట్లు సీట్ల కోసం చేస్తున్న యాత్ర కాదు
ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్.

రాష్ట్ర ప్రజలు, విద్యార్థులు, యువత శ్రేయస్సుకు, భవిష్యత్తు కోసం ప్రత్యేక హోదా సాధన అవసరం అనిఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్ పేర్కొన్నారు. ప్రస్తుతం చేస్తున్న బస్సుయాత్ర ఓట్లు, సీట్ల కోసం చేస్తున్నది కాదని, మనందరి బాగోగుల కోసం చేస్తున్న యాత్ర అన్నారు. ప్రభుత్వాలు అనేక అడ్డంకులు సృష్టించి యాత్రను అడ్డుకోవాలని చూసినా, న్యాయవ్యవస్థ ద్వారా యాత్రను కొనసాగిస్తున్నాం అన్నారు.

బిజెపి మొడలు వంచుదాం..
డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న

రాష్ట్రానికి మేలు జరగాలంటే హోదా ఒక్కటే మార్గం అని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న తెలిపారు. బిజెపి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. పోరాట పటిమను సాహిత్యంతో చాటి చెప్పిన వేమన స్ఫూర్తితో సమరశీల పోరాటం సాగించాలన్నారు. పట్టు విడవకుండా మోదీ ప్రభుత్వం మెడలు వంచైనా హోదా సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ అనంతపురం, పుట్టపర్తి జిల్లా కార్యదర్శులు జాఫర్, వేమయ్య యాదవ్, ప్రొఫెసర్ సదాశివానంద రెడ్డి, సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శివ, ఉపాధ్యక్షుడు గిరి, సిద్ధార్థ, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్ బాబు, రాజేంద్ర, పీడీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, రాజశేఖర్, బిసిఆర్పిఎస్ జాతీయ అధ్యక్షుడు సాకే నరేష్, బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనారిటీ నాయకుడు సురేష్, ఎఐఎస్ఎ రాష్ట్ర అధ్యక్షుడు వేమన్నతో పాటు విద్యార్థి యువజన సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముస్తాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

74వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానం ముస్తాబు అయ్యింది. గురువారం ఉదయం 9 గంటలకు వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. వేడుకల నేపథ్యంలో ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ పరేడ్ మైదానంలో అధికారులతో సమీక్షించారు. ముఖ్య అతిథులు హాజరు, జాతీయ పతాక ఆవిష్కరణ, గౌరవ వందనం, వాహనంపై వెళ్లి పరేడ్ రిహార్సల్స్‌ను ఎస్పీ పరిశీలించారు. ఈ సదర్భంగా పలు అంశాలపై ఎస్పీ సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామకష్ణ ప్రసాద్, డీఎస్పీ ఉమామహేశ్వర్ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే కీలకం

కలెక్టర్ పి.బసంత్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి కలెక్టరేట్

ప్రజాస్వామ్య దేశంలో ఓటు చాలా కీలకమైనదని, ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకుని దానిని వజ్రాయుధంలా వినియోగించుకోవాలని కలెక్టర్ పి.బసంత్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం పుట్టపర్తి మంగళకర కళాశాలలో 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిరవ్హఇంచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుఊత 1950 సంవత్సరంలో ఎన్నికల సంఘం ఏర్పాటు అయియందని ఆ మరుసటి రోజే భారత గణతంత్ర రాజ్యాంగా అవతరించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2011 సంవత్సరం జనవరి 25 నుంచి ఓటర్ల దినోత్సవ సంవత్సరంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఓటు హక్కు, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కోసం అనేక చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 18 సంవత్సరాలు కలిగిన యువతీ యువకులు అందరూ ఓటు నమోదు చేయించుకోవాలని సూచించారు. అర్హత ఉన్న వారందరూ తప్పకుండా ఎన్నికల్లో పాల్గొని ఆదర్శవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం మన వంతు పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. బలమైన ప్రజాస్వామ్య పరిపాలన ప్రభుత్వం ఏర్పాటు కోసం సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకునేందుకు ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటు తరతరాల గతిని మార్చే అస్త్రం ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉంటుందన్నారు. అనంతరం ఓటర్ల ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టారు. యువ ఓటర్లకు ఓటరు ఎపిక్ కార్డులను పంపిణీ చేశారు. అంతకు ముందు కలెక్టర్ కార్యాలయంలో ఉదయం జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ బసంత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ చేతన్, డిఆర్ఒ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, జిల్లా అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం తహశీల్దార్లు శ్రీనివాసులు, మైనుద్దీన్, మంగళకర కళాశాల కరస్పాండెంట్ సురేష్, తహశీల్దార్ నవీన్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు విద్యార్థులు పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డు పనులకు శ్రీకారం

ప్రజాశక్తి - కదిరి టౌన్

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకట ప్రసాద్ తన సొంత నిధులు వెచ్చించి రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. పట్టణంలోని కదిరి హిందూపురం ప్రధాన రహదారిలో హిందూపురం క్రాస్ నుండి కోనేరు సర్కిల్ వరకు మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అలాగే రోడ్డుకి ఇరువైపులు ఉన్న దుకాణదారులు ధూళి దుమ్ముతో అనారోగ్య పాలవుతున్నారు. సమస్యపై పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి టిడిపి, సిపిఎం ఆధ్వర్యంలో నిరసన రూపాలోల తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యను దృష్టిలో ఉంచుకొని స్పందించిన కందికుంట వెంకటప్రసాద్ బుధవారం తన సొంత నిధులతో హిందూపూర్ క్రాస్ నుండి కోనేరు కూడలి వరకు రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. సమస్య పరిష్కరించడంతో పట్టణవాసులు వాహన చోదకులు హర్ష వ్యక్తం చేశారు. కందికుంట వెంకటప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను శాశ్వత చట్టంగా మార్చాలి

ప్రజాశక్తి - సోమందేపల్లి

ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టానికి కాల పరిమితి లేకుండా శాశ్వతంగా చట్టంగా మార్చాలని కెవిపిఎస్, ఎంఆర్‌పిఎస్, తదితర ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిటి శ్రీకాంత్‌కు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్వరలో జరిగే అసెంబ్లీ , పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు శాశ్వత చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు హనుమయ్య, వెంకటేశులు, సిపిఎం నాయకులు కొండా వెంకటేష్, రంగప్ప, శీలా నారాయణస్వామి, రామాంజనేయులు దండోరా సూర్యనారాయణ, ఎంఆర్‌పిఎస్ బాబు, గంగాధర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లో 36 షెడ్లకు బహిరంగ వేలం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలో నూతనంగా నిర్మించిన కొత్త కూరగాయల మార్కెట్లోని షాపింగ్ కాంప్లెక్స్‌లోని బ్లాక్ నెంబరులో 36 షెడ్లకు నెలసరి అద్దె ప్రాతిపదికన బహిరంగ వేలం పాటను మున్సిపల్ అధికారులు బుధవారం నిర్వహించారు. ఒక్కో షెడ్‌కు రూ.1700 చొప్పున వేలం పాటలో పాటదారులు దక్కించుకున్నారు. వేలం పాటలో ఎలాంటి సమస్య తలెత్తకుండా వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం పోలీసు బందోబస్తు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మున్సిపల్ వైస్ చైర్మన్లు పెనుజూరు నాగరాజు, బాగ్యలక్ష్మి, అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, డిఇ వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలు తక్షణమే అందజేయాలి

ధర్మవరం టౌన్ : జగనన్న కాలనీలో ఇళ్లనిర్మాణాలకు ప్రభుత్వం అందించే రూ.1.80లక్షలు ఏమూలకు సరిపోదని కావున సిమెంట్, ఇసుకతో కలిపి మొత్తం రూ.7లక్షలు ఇవ్వాలని, టిడ్కో గృహాలను తక్షణమే లబ్ధిదారులకు అందజేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆపార్టీ నాయకులతో కలసి ధర్మవరంలోని పోతులనాగేపల్లి జగనన్న కాలనీని బుధవారం సాయంత్రం సందర్శించారు. ఈసందర్భంగా లబ్ధిదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, నాయకులు ముసుగుమధు, జింకాచలపతి, రవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం :జగనన్న ఇంటి నిర్మాణానికి ప్రస్తుతం ఉన్న ధరలకు అనుగుణంగా రూ. 5 లక్షలకు పెంచాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కొటిపి వద్ద ఉన్నా జగనన్న కాలనీలో పర్యటించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, స్థానిక నాయకులు ఇస్మాయిల్, వినోద్‌కుమార్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నాయకులు

ఘనంగా ఓటరు దినోత్సవం

గోరంట్ల : పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాల, ఎస్వీవిఎం డిగ్రీ కళాశాలలో బుధవారం ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భక్తవత్సలం మాట్లాడుతూ ఓటు హక్కు అనేది ఒక వజ్రాయుధం లాంటిదన్నారు. 18 ఏళ్ల పైబడిన యువతీ యువకులు ఓటు హక్కుకు తమ పేరు నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పిఒలు ఆజాద్, రఘునాథ్ రెడ్డి, వీరాంజనేయులు, అధ్యాపకులు కవిత, హరీష్, బాలమోహన్, శివ శంకర్ రెడ్డి, లక్ష్మి, భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

లేపాక్షి : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో ఓటర్లతో తహశీల్దార్ బాబు ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహనాయుడు, డిప్యూటీ తహశీల్దార్ కుమార్ రెడ్డి, ఎపిఎం జయచంద్ర, ఎపిఒ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం, పరిగి సచివాలయం 1, గ్రంథాలయం వద్ద జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఓటుహక్కు ప్రాధాన్యతను తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎస్ఐ నరేంద్రకు వివరించారు.

ధర్మవరం టౌన్ : 18 సంవత్సరాలు నిండి నూతనంగా ఓటరు జాబితాలో నమోదు కాబడిన యువతకు ఓటరు గుర్తింపు కార్డులను ఆర్డీవో తిప్పేనాయక్ పంపిణీ చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని నూతన ఓటరు గుర్తింపు కార్డులను బుధవారం పంపిణీ చేశారు. దీంతోపాటు డిస్టరీ, పెన్నులను అందించారు.ఈ కార్యక్రమంలో డివిజినల్ పరిపాలన అధికారి ఖతిజున్‌కుఫ్రా, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది వరప్రసాద్, ఎన్నికల సిబ్బంది రాజ్‌కుమార్, రాజేశ్వరి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సిఐటియు అనుబంధ యూనియన్ నాయకులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు బుధవారం నిరసన తెలిపి అనంతరం కమిషనర్ వెంకటరామిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పుట్టపర్తి నగర పంచాయతీలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్ ఇఎస్ఐ బకాయిలు చెల్లించాలని గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఎఫ్ఆర్ఎస్ విధానం రద్దు చేయాలని కోరారు. స్మార్ట్ ఫోన్ లేక, ఎఫ్ఆర్ఎస్ ఆపరేట్ చేయలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న పిఎఫ్ సమస్య పరిష్కరించాలని, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. శానిటేషన్, ఇంజనీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామయ్య, పెద్దన్న, నరసింహులు, నాగార్జున, రామదాసు, రమేష్, గణేష్, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రెడ్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ లింగం నిర్మల, తదితరులు

పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి

ధర్మవరం టౌన్ : ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి ఉందనిపరమపిత వెంకటరమణాచార్య గురువు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు యోగిముక్తేశ్వరి మాతాజీ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం మున్సిపల్ ఛైర్పర్సన్ లింగం నిర్మల, వైస్ ఛైర్మన్లు యర్రగుంట్ల భాగ్యలక్ష్మి, పెనుజూరు నాగరాజుల చేతులమీదుగా ట్రస్టు సభ్యులు రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. పరమపిత వెంకటరమణాచార్య గురువు చారిటబుల్ ట్రస్ట్ 11వ వార్షికోత్సవం సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు యోగిముక్తేశ్వరి మాతాజీ, మణిజ్ఞానశ్రీల నేతత్వంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు.. ఈ కార్యక్రమంలో ట్రస్టు వైస్ ఛైర్మన్ అశోక్ కుమార్, కార్యదర్శి రామంజినేయాచారి, ఉప కార్యదర్శి మల్లికార్జున, కోశాధికారి నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -పెనుకొండ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాబా డిమాండ్ చేశారు. బుధవారం పట్టణం లో ఎన్ హెచ్ 44 హైవే జంక్షన్ వద్ద జరిగిన కార్యక్రమంలో నూతనంగా ఆటో యూనియన్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు గౌస్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాబా, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ స్వయంకృషితో బతుకుతున్న ఆటో కార్మికులకు ఎటువంటి సంక్షేమ పథకాలు లేవన్నారు. వీరికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, సిఐటియు మండల నాయకులు తిప్పన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి , మహబూబ్‌బాషా, ఆటో యూనియన్ నాయకులు వజ్రం నాగప్ప , రెడ్డప్ప, మూర్తి, మునియప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి www.prajasakti.com

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

గోరంట్ల : రజకులను ఎస్సీల జాబితాలో చేర్చాలని రాష్ట్ర రజక సాధికారత సమితి డైరెక్టర్ రామచంద్ర డిమాండ్ చేశారు ఈ సందర్భంగా మండలంలోని మందలపల్లి గ్రామంలో రజకులు సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో రామచంద్ర మాట్లాడుతూ రజకులను ఎస్సీల జాబితాలో చేర్చాలని అనేక మార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోలేదన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చకపోతేఉద్యమ రూపంలో పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, ఆనంద్, సోమశేఖర్, రాధమ్మ, చలపతి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

28న సామూహిక సూర్యనమస్కారాలు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని యోగా సెంటర్లలోని సభ్యులు స్థానిక సాంస్కృతిక మండలిలో ఈనెల 28న ఉదయం సూర్యనమస్కారాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యోగా అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు అసోసియేషన్ సభ్యులు గాజుల సోమేశ్వరరెడ్డి, నరసింహులు తదితరులు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

అర్హులైన రైతులందరికీ సంక్షేమ పథకాలు

బుక్కపట్నం : అర్హులైన రైతులందరికీ రైతు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా అగ్రి అడ్వైజరీ చైర్మన్ రమణారెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కొత్తకోట రైతు భరోసా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రం ద్వారా ప్రతి రైతుకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందుతున్న సబ్సిడీ పథకాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వంటి వాటిపై రైతు భరోసాకేంద్ర సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల ద్వారా విద్యా నైపుణ్యం

బుక్కపట్నం : పుస్తకాల ద్వారా విద్యా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మయ్య తెలిపారు బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి, మూడవ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు లైఫ్ స్కిల్స్, సిల్క్ డెవలప్మెంట్ కోర్సులకు ఉన్నత స్థాయి నిపుణుల కమిటీ ద్వారా తయారు చేయబడిన పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ పుస్తకాల ద్వారా విద్యార్థులు విద్య పెంపొందించుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రవికుమార్, వెంకటేశ్వర ప్రసాద్, ఆదినారాయణ, ఓబయ్య, దస్తగిరి, వెంకటకృష్ణయ్య, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని 27, 28వ వార్డులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన టిడిపి సిబిఎన్ సభ్యులు రామకృష్ణ, ఆనందరెడ్డిని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ బుధవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి మహేష్ చౌదరి, కమతంకాటమయ్య, పురుషోత్తంగౌడ్, పరిసేసుధాకర్, చీమలరామాంజి తదితరులు ఉన్నారు.

ఉత్తమ డిపో మేనేజర్‌గా మైనోద్దీన్

కదిరి టౌన్ : ఆర్టీసీలో ఉత్తమ డిపో మేనేజరుగా కదిరి డిపో మేనేజర్ బి.మైనోద్దీన్ ఎంపికకావడం పట్ల కదిరి డిపో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేసారు. ఈ మేరకు రిపబ్లిక్ డే దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ఆయనను అవార్డు తీసుకోనున్నారు. అలాగే కదిరి డిపోలో అసిస్టెంట్ మేనేజరుగా పనిచేస్తున్న ఎస్.హరిత, అసిస్టెంట్ ఇంజనీరు రామక్రిష్ణ కూడా అవార్డులు వరించనున్నాయి. వీరు కూడా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు. దీంతో కదిరి డిపో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ నాయకులు హరిమోహన్, ఎస్.వి.రమణ, బైరిశెట్టి, రామక్రిష్ణ, ప్రభాకర్ రెడ్డి, ఓబులేసు, నారాయణస్వామి, గంగన్న, మల్లికార్జున తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కదిరి ఆర్టీసీ డిఎం మైనుద్దీన్

కంప చెట్లు తొలిగింపు

చిలమత్తూరు : మండలంలోని కొడికొండ గ్రామ పంచాయతీ కేంద్రం నుండి కోర్లకుంట, టి.గొల్లపల్లి నుండి ఓబుళాపురం రహదారికి ఇరువైపులా అడ్డుగా ఉన్న కంప చెట్లు, పిచ్చి మొక్కల తొలగింపు కార్యక్రమాన్ని సర్పంచి ఈడిగ తిరుపాలేష్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. దాదాపు 5 కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరు వైపులా వున్న కంప చెట్లను రెండు రోజుల్లో తొలగిస్తామని ఈ సందర్భంగా సర్పంచి చెప్పారు.

పేదల ఆరోగ్య పరిరక్షణకే ఆరోగ్యరథం : టిడిపి

హిందూపురం : హిందూపురం ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఆరోగ్య రథం ఏర్పాటు చేసి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్నారని టిడిపి పట్టణ అధ్యక్షులు రమేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఎన్టీఆర్ ఆరోగ్య రథం ద్వారా పట్టణంలోని రహమత్ పురంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య సిబ్బంది వివిధ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దాదాపు 600 మంది ఉచిత వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాదాపీర్, వైద్యులు ఆదేశ్, క్లస్టర్ వెంకటేష్, అంజాద్, దేశాయ్ మురళి, ఇంతియాజ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

'సిసి'ని కలసిన సినీనటుడు తారకరత్న

హిందూపురం : హిందూపురం మాజీ ఎమ్మెల్యే, టిడిపి సీనియర్ నాయకులు సిసి వెంకటరాముడును ఆయన నివాసంలో నందమూరి తారకరత్న బుధవారం కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

స్థానిక నాయకులతో నందమూరి తారకరత్న

ధర్మవరంలో పరిటాల రవీంద్ర ఫ్లెక్సీలు చించివేత

ధర్మవరంలో చించివేసిన ఫ్లెక్సీ

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరంలో టీడీపీ నాయకులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను చించివేశారు. పరిటాల రవీంద్ర వర్ధంతి సందర్భంగా టీడీపీ నాయకులు ఫ్లెక్సీలను పట్టణమంతా ఏర్పాటుచేశారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి పరిటాల రవీంద్ర ఫ్లెక్సీలను కొందరు దుండగులు చించివేశారు. దీంతో బుధవారం టీడీపీ నాయకులు కాలేజ్ సర్కిల్ వద్ద నిరసన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించారు. ఫ్లెక్సీలను చించివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ఏడాది సెప్టెంబరులో పరిటాల శ్రీరామ్ జన్మదిన వేడుకల సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను కూడా చిం చివేశారన్నారు. అప్పట్లో కూడా పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. అప్పట్లో ఫ్లెక్సీలు చించివేసినవారిపై చర్యలు తీసుకుని ఉంటే ప్రస్తుతం ఇలాంటి సంఘటనలు జరిగిఉండేవి కావని వ్యాఖ్యానించారు. పట్టణంలో వన్ టౌన్ పోలీసు స్టేషన్‌ఎదుటే ఫ్లెక్సీలను చించివేయడం దారుణమన్నారు. దీన్ని బట్టి చూస్తుంటే పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు అర్థమవుతోందని విమర్శించారు. ధర్మవరంలో

టిడిపి ఆధ్వర్యంలో ఆందోళన

టీడీపీ నాయకులపై దాడులు, దౌర్జన్యాలతో పాటు ఇలా ఫ్లెక్సీలను సైతం చించివేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా ఫ్లెక్సీల చించే సంస్కృతిని మానుకోవాలని హితవుపలికారు. అనంతరం పెక్సీలను చించివేసినవారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు స్థానిక వన్ టౌన్ సిఐ సుబ్రమణ్యంకు ఫిర్యాదుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమతం కాటమయ్య, చింతలపల్లి మహేష్‌చౌదరి, ఫణికుమార్, పురుషోత్తంగౌడ్, పరిశేసుధాకర్, భీమనేని ప్రసాద్‌నాయుడు, రాంపురం శీన తదితరులు పాల్గొన్నారు

మోసం చేసి ఉద్యోగం రాయించుకున్నారని ఫిర్యాదు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

తనను మోసం చేసి తన కాంట్రాక్ట్ ఉద్యోగాన్ని ఇతరులు రాయించుకున్నారని బాధితుడు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ లో బుధవారం ఫిర్యాదు చేశాడు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలు... పట్టణంలోని దర్గావీధికి చెందిన వెంకటరమణమూర్తి 15 సంవత్సరాల నుంచి లక్ష్మీచెన్నకేశవపురంలోని విద్యుత్ సబ్ స్టేషన్ లో కాంట్రాక్ట్ షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఆరు నెలల నుంచి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వెంకటరమణమూర్తి వైద్యం చేయించు కుంటున్నాడు. ఇది గమనించిన విద్యుత్ శాఖ డి 1 సెక్షన్ లైన్‌మెన్ ప్రసాద్, మరో లైన్‌మెన్ అశ్వర్థనారాయణ కలసి తమ బంధువైన అశోక చక్రవర్తి అనే వ్యక్తికి ఉద్యోగం ఇప్పించాలని పన్నాగం పన్నారు. వైద్యం చేయించుకుంటున్న వెంకటరమణమూర్తి వద్దకు వెళ్లి 'నీ ఆరోగ్యం సరిగాలేదు. నీకు మెడికల్ బిల్లులు పెట్టిస్తామ'ని నమ్మబలికి తెల్ల కాగితంలో సంతకాలు చేయించుకున్నారు. అనారోగ్యం కారణంగా నెలరోజులపాటు సెలవు పెట్టిన వెంకటరమణమూర్తి తిరిగి విధుల్లోకి వెళ్లగా ఉద్యోగం ఇతరులకు రాసిచ్చావని ఉద్యోగం వద్దు అని సంతకం చేశావని పై అధికారులు చెప్పడంతో వెంకటరమణమూర్తి అవాక్కయ్యాడు. ఈ విషయంపై విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులను కలిసినా ఫలితం లేకపోవడంతో తనను మోసం చేసిన లైన్‌మెన్లు ప్రసాద్, అశ్వర్థనారాయణ, వారి బంధువు అశోక చక్రవర్తిపై బాధితుడు వెంకటరమణమూర్తి స్థానిక వన్‌టౌన్ పోలీస్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రాష్ట్రంలో దోపిడీ పాలన : టిడిపి

నిరసన వ్యక్తం చేస్తున్న పల్లె, తదితరులు

ఓబుల దేవర చెరువు : రాష్ట్రంలో దోపిడీ పాలన సాగుతోందని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి విమర్శించారు. బుధవారం మండల పరిధిలోని అల్లాపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాలలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో పల్లె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతు ప్రభుత్వం అని చెబుతూనే రైతులకు చేసిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, నాయకులు బోయపల్లి శివారెడ్డి, షబ్బీర్‌బాషా, చాంద్‌బాషా , షాను, ఆరీఫ ఖాన్, అంజినప్ప, మీసేవ సుధాకర్, నాగరాజు, కంచి సురేష్ తదితరులు పాల్గొన్నారు

రొళ్ల : మండలంలోని బిజి. హళ్లి పంచాయతీలో బుధవారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా గుండుమల మాట్లాడుతూ టిడిపి చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి అనే కార్యక్రమానికి మంచి ప్రజాధారణ లభిస్తోందన్నారు. దీనిని చూసి ఓర్వలేని వైసిపి నాయకులు టీడీపీ కార్యకర్తల పింఛన్లు తొలగిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొంకల్లు క్రిష్టమూర్తితో పాటు నాయకులు, గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

రొద్దం : టిడిపి హయాంలోనే రాష్ట్రాభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్యే బికె. పార్థసారధి అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి, గౌరాజుపల్లిలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో బికె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి సవిత, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, అధికార ప్రతినిధి నరసింహులు, చిన్నప్పయ్య, చంద్రమౌళి, మాధవ నాయుడు, మురళి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

పెనుకొండ : ప్రతి ఇంటికి నవరత్న పథకాలతో లబ్ది చేకూరుతోందని పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ అన్నారు. నగరపంచాయతీ పరిధి 19 వ వార్డు పరిధిలోని కోనాపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కాలనీవాసులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లిప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫరూక్ , మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ , వైస్ చైర్మన్లు సునీల్ కుమార్, వైసిపి టౌన్ కన్వీనర్ నరసింహ, మండల కన్వీనర్ నాగలూరు బాబు , ఎంపీపీ గీతా రామ్మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ గుట్టూరు శ్రీరాములుతో పాటు ఆయాశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎక్కడకు వెళ్లిన ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నారని శాసనసభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం పుట్టపర్తిలోని రెండవ వార్డులో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్ శ్రీ లక్ష్మీ నారాయణ రెడ్డి, పుడా చైర్‌పర్సన్ లక్ష్మి నరసమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్లు చెరువు భాస్కర్ రెడ్డి, సూర్య గౌడ్, సాయి గీత, సింగల్ విండో అధ్యక్షుడు ఋషికేశవరెడ్డి, నరసారెడ్డి, బిల్డర్ మల్లి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : సమస్యల పరిష్కారం కోసమే ప్రజల వద్దకు వచ్చామని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. బుధవారం హిందూపురం రూరల్ మండలం బేవినహళ్లి పంచాయతీ పరిధిలో గల సంజీవరాయనిపల్లి, ఊడగలపల్లి గ్రామాలలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఆనంద్, జెడ్పీటీసీ నాగభూషణ, వైస్ ఎంపీపీ రఘునాథ్ రెడ్డి, మల్లేష్, వైస్ సర్పంచి సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోనిఆర్ఎస్ రోడ్డు, గాంధీ నగర్ మౌనిక థియేటర్ మురాద్ షా మసీద్ వీధుల్లో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పరికి నజీమున్నీసాసాదిక్, వైస్ చైర్మన్లు కొమ్ము గంగాదేవి శంకర్, రాజశేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు నాషేర్, జిలాన్, ఇస్మాయిల్, ప్రణీత్ రెడ్డి, రంగారెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీవనోపాధికి ప్రత్యామ్నాయం చూపాలి

పట్టణంలోని ఫ్లెక్సీ తయారీ దుకాణం

ప్రజాశక్తి కదిరి అర్బన్

జీవనోపాధికి తమకు తగిన ప్రత్యామ్నాయం చూపాలని ఫ్లెక్సీల తయారీదారులు కోరుతున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ లక్షలాది రూపాయలు అప్పులు చేసి ఫ్లెక్సీలు తయారు చేసే యంత్రాలను తెచ్చుకొని వాటితోనే జీవన ఉపాధి పొందుతున్నామన్నారు. ఫ్లెక్సీల ప్రింటింగ్ వృత్తినే నమ్ముకున్న తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రత్యామ్నాయం చూపకుండా ఉన్నపలంగా ఫ్లెక్సీల తయారీని నిషేధిస్తే తమ పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. కదిరి పట్టణ కేంద్రంలోని మూడు ఫ్లెక్సీ కేంద్రాల ద్వారా దాదాపు 50 మంది జీవనోపాధి పొందుతున్నారని వారు ప్రస్తుతం ఉపాధిని కోల్పోతున్నారని వాపోయారు. ప్రభుత్వం తమకు తగిన ప్రత్యామ్నాం చూపించాలని వారు కోరుతున్నారు.

ఫ్లెక్సీల నిషేధానికి పటిష్ట చర్యలు : కమిషనర్

ఫ్లెక్సీల తయారీ, ప్రదర్శన నిషేధానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు తెలిపారు. ఇప్పటికే ప్రజాప్రతినిధులకు,రాజకీయ పార్టీ నాయకులకు, వ్యాపారస్తులకు ఫ్లెక్సీలు నిషేధించినట్లు సమాచారం పంపామన్నారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధించడానికి ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ చెప్పారు. డిఇ అధ్యక్షతన ఒక టీమును, సచివాలయం పరిధిలోని నలుగురు కార్యదర్శులతో ఒక టీమును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు కూడా పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రూ. 4 కోట్లకు కుచ్చుటోపీ

చెక్కెర, సిగరెట్ల వ్యాపారమంటూ నమ్మబలికిన వైనం

లబోదిబోమంటున్న బాధితులు

సోమందేపల్లి : చెక్కెర, సిగరెట్ల హోల్‌సేల్ వ్యాపారం చేస్తున్నానంటూ ప్రజలను నమ్మబలికాడు. రెండు లక్షల డెబ్బై వేల రూపాయలు కడితే రోజుకు రూ. 4 వేలు చొప్పున 4 సంవత్సరాలపాటు ఇస్తానని చెప్పడంతో ఆశ పడ్డ కొందరు లక్షలాది రూపాయలు అతనికి ఇచ్చారు. నెలరోజులపాటు నమ్మకంగా ఇవ్వడంతో మరికొంతమంది ఎవరికి తెలియకుండా మరింత ఇచ్చారు. నెలరోజులలో దాదాపుగా రూ.4 కోట్లు వసూలు చేసుకొని ఉడాయించిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకొంది. బాధితుల కథనం మేరకు ఎక్కడ నుండో వచ్చిన మనోహర్ రెడ్డి అనే వ్యక్తి నెలరోజుల క్రితం సోమందేపల్లి గ్రామంలోని వాల్మీకి విగ్రహం దగ్గర ఒక దుకాణంలో చెక్కెర, సిగరెట్ల వ్యాపారం ప్రారంభించాడు. తాను చెక్కెర, సిగరెట్ల వ్యాపారం చేస్తున్నానని, ప్రతిరోజూ వేలాది టన్నుల చెక్కెర, వందలాది బండల్ సిగరెట్లు అమ్ముతున్నానని చెప్పాడు. తనతో పాటు ఎవరైనా చేరడానికి అవకాశం ఉందని, రూ. 2.70 లక్షలు కడితే నెలకు రూ.4 వేలు చొప్పున ఇస్తానని నమ్మబలికాడు. అలా కొంతమందికి ఇచ్చాడు. దీంతో చాలామంది ఆశపడి అప్పులు చేసి మనోహర్ రెడ్డి అనే వ్యక్తికి డబ్బులు ఇచ్చారు. తామే కాకుండా తమ బంధువులతో కూడా డబ్బులు కట్టించారు. ఆలా దాదాపుగా రూ. 4 కోట్ల వరకు మనోహర్‌రెడ్డి వసూలు చేసినట్లు సమాచారం. కొందరికి అనుమానం వచ్చి డబ్బులు వెనక్కి ఇమ్మని అడగడంతో కొందరికి ఇచ్చాడు. మిగిలిన వారు ఎక్కడ అడుగుతారో అని మంగళవారం రాత్రి దుకాణం ఎత్తేసాడు. బుధవారం ఉదయాన్నే అనుమానం వచ్చి వెళ్లి చూడగా దుకాణానికి తాళం వేసి ఉంది. ఇంటికి తాళం వేయడంతో ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో మోసపోయామని తెలుసుకున్న బాధితులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. అప్పులు చేసి డబ్బులు కట్టామని కొందరు బంగారు బ్యాంకులో బంగారు ఉంచి తెచ్చి ఇచ్చామని వాపోయారు. మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల గ్రామాల ప్రజలు కూడా ఇందులో ఉన్నారు. ఇలాంటి మోసాలు జరుగుతున్నట్లు తెలిసినా కూడా ఎలా మోసపోతున్నారో అర్థం కావడం లేదని పోలీసులు అంటున్నారు. ఈ మేరకు ఎస్ఐ విజయ్ కుమార్ మనోహర్‌రెడ్డి ఉన్న కార్యాలయాన్ని బాదితులతో కలిసి తనిఖీ చేశారు.

కార్యాలయం వద్ద బాధితుల ఆందోళన

యువకుడు ఆత్మహత్య

సోమందేపల్లి : మండల కేంద్రంలోని గీతానగర్‌కు చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాలనీకి చెందిన చింత గోపీనాథ్ (28) డిగ్రీ పూర్తి చేసి మగ్గం పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. గోపీనాథ్ అందరితో బాగా ఉండేవాడు. కుటుంబ కలహాలు ఏమి కూడా లేవు. అయితే బుధవారం ఉదయం ఆరు గంటల సమయంలో స్థానిక హిందూపురం రోడ్డు ఇండియన్ పెట్రోల్ బంక్ వెనుక వైపు కానుగ చెట్టుకి తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. యువకుడి ఆత్మమత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

అక్రమంగా డీజిల్ తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు

కనగాన పల్లి : కర్నాటక నుంచి అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సిబ్బందితో తగరకుంట గ్రామం బయట వాహనాలు తనిఖీ చేస్తుండగా నాగలమడక నుంచి 15 వందల లీటర్ల డీజిల్‌ను గూడ్స్ వెహికల్‌లో అక్రమంగా తరలిస్తున్న విషయాన్ని గమనించామన్నారు. దీంతో నిందితులను అరెస్టు చేసి 15 వందల కర్నాటక డీజిల్‌ను, వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ కర్నాటక వాసి మృతి

బత్తలపల్లి : బతుకుదెరువు నిమిత్తం వచ్చిన కర్నాటక వాసి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. బత్తలపల్లి ఎస్ఐ శ్రీహర్ష తెలిపిన వివరాలు... కర్నాటక రాష్ట్రం చిత్రదుర్గ జిల్లా, మొలకలమూరు తాలూకా, బొమ్మనగొండనకేరే గ్రామంలోని క్ష్మీ ఏకే కాలనీకి చెందిన మల్లిఖార్జున(58) బేల్దారి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. పది రోజులు క్రితం మల్లిఖార్జునతో పాటు అదేగ్రామానికి చెందిన అభిషేక్, బసన్నకలిసి బత్తలపల్లిలో బేల్దారి పనులు చేసేందుకు వచ్చారు. ఈ నెల 21వ తేదీన బత్తలపల్లి నుంచి అనంతపురం వైపు వెలుతున్న ద్విచక్రవాహనం రోడ్డు దాటుకుంటున్న మల్లిఖార్జునను కొంది. ఈ ప్రమాదంలో మల్లిఖార్జున తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం బళ్లారి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రస్తా ఆక్రమణదారులపై చర్యలకు డిమాండ్

సోమందేపల్లి : మండల పరిధిలోని ఈదులబలాపురం గ్రామంలో రస్తా ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. గ్రామంలో 239 సర్వే నంబర్ లో 7.56 ఎకరాల రస్తా పోరంబోకు ఉందన్నారు. గ్రామంలో నుండి గుడ్డం నాగేపల్లి కి, బ్రాహ్మణ పల్లికి రోడ్డు ఉందన్నారు. అంతేకాకుండా గుడ్డం నాగేపల్లి రోడ్డు లో గ్రామానికి సమీపంలో 400 కెవి సబ్ స్టేషన్ ఉందన్నారు. అక్కడకు నిత్యం లారీలు వస్తూ వెళు తుంటాయన్నారు. రోడ్డు అక్రమణతో వాటితో పాటు ప్రజలకు ఇబ్బందిగా తయారయ్యిందని వారు వాపోయారు. గ్రామానికి చెందిన నారాయణప్ప రస్తాను ఆక్రమించుకొన్నాడని వెంటనే చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్పందించిన డిప్యూటీ తహశీల్దార్ శ్రీకాంత్ వారితో మాట్లాడారు. రెండు రోజుల్లో గ్రామానికి వచ్చి పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన ను విరమించారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న డిటి

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలి

పుట్టపర్తి అర్బన్ : రాష్ట్రంలో అతిపెద్ద పరిశ్రమగా పేరు పొందిన విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రవేటీకరణ చేయాలని చూస్తోందని, ఇది చాలా దుర్మార్గమైన చర్యని సిపిఐ, ఎఐటియు నాయకులు విమర్శించారు. బుధవారం స్థానిక గణేష్ సర్కిల్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్ వద్ద కు చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం డిఆర్ఒ కొండయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బయన్న, సిపిఐ డివిజన్ కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు వేమనారాయణ, జయలక్ష్మి, వెంకటనారాయణ, భాష, చలపతి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న అన్నేఫెర్రర్

ప్రజాశక్తి - బత్తలపల్లి

సమాజంలోని తోటి వారికి సహాయపడే గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఆర్డీటీ అసోషియేట్ డైరెక్టర్ అన్నేఫెర్రర్ పేర్కొన్నారు. బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ రిలే అల్ట్రా మారథాన్ పరుగు ముగింపు సమావేశానికి ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి. అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా అన్నేఫెర్రర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్, మహిళా సాధికారిత డైరెక్టర్ విశాలా ఫెర్రర్, మారథాన్ రన్ ఫౌండర్ హువాన్ మాన్వెల్, లూస్ మరియా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థను జిల్లాలో స్థాపించి 50 వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలన్నదే సంస్థ లక్ష్యమన్నారు. దాతలతో పాటు లబ్ధిపొందుతున్న వారు, ప్రజలు ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలన్నారు. అల్ట్రా మారథాన్ పరుగును జిల్లాలో చేపడుతున్న జువాన్ మాన్వెల్‌ను అభినందించాలన్నారు. ఇది ఇలాగే కొనసాగిస్తామన్నారు. వచ్చే మారథాన్ రన్ ను ఎలా చేయాలనే విషయమై ఆలోచిస్తున్నామన్నారు. మారథాన్ రన్‌లో పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. హువాన్ మాన్వెల్ మాట్లాడుతూ వారం రోజులుగా కష్టపడి ఇది చేపట్టిన వారికి ధన్యవాదాలు తెలిపారు. తనతో పాటు సేవలో పాల్గొన్న వారందరికీ అభినందనలు తెలిపారు తొమ్మిదవ మారథాన్లో అందరం కలుసుకుందామన్నారు. లూస్ మరియా మాట్లాడుతూ ఈ రన్ ద్వారా చాలా మంది జీవితాల్లో మార్పు వస్తుందని ఆశిస్తున్నామన్నారు. ఈ నిధినిఆర్డీటి చేపట్టిన వివిధ అభివద్ధి పనులకు వెచ్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు సాగర్ మూర్తి, సాయికష్ణ, చంద్రశేఖర్ నాయుడు. నాగేశ్వరరెడ్డి, నిరంజన్, షీబా, రాధ, దాదాఖలందర్, సిరెప్ప, మల్లిఖార్జున, ప్రమీల, డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఎటిఎల్ రుక్మాంగదతో పాటు ఆర్డీటి సిబ్బంది, స్పానిస్ బృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన శాస్త్రవేత్తకు అరుదైన గౌరవం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తకు డాక్టర్ సంపత్ కుమార్ కు అరుదైన గౌరవం లభించింది. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి వారి భారతీయ నూనె గింజల నూనె గింజల పరిశోధన సంస్థ హైదరాబాద్ వారిద్వారా ఆయనకు జాతీయ పురస్కారం లభించింది. నూనె గింజలలో ప్రధాన పంట వేరుశనగలను వేరు చేసిన కృషి వలన ఈ పురస్కారం లభించింది. పంటలలో వీరు 500 వందలకు పైగా పత్రికా ప్రచురణాలు. 50 కి పైగా పరిశోధన పత్రాలు ప్రచురించారు. 25 కు పైగా జాతీయ అంతర్జాతీయ సెమినార్లలో పాల్గొని పరిశోధన పత్రాలు సమర్పించారు. వేరుశనగలో 10 రకాల కు పైగా కొత్త రకాలను ప్రవేశపెట్టి పంటపై మంచి ప్రభావం చూపడం వలన అధిక దిగుబడికి దోహద పడింది. ఈ విషయాల్ల కీలకపాత్ర పోషించినందుకుగాను ఐ కార్ ఇండియన్ సొసైటీ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్ లో బంగారు పతకం వరించింది. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ తనకు వ్యక్తిగతంగా కాకుండా కదిరి వ్యవసాయ పరిశోధన స్థానానికి జాతీయ గుర్తింపు లభించిందని అన్నారు. కదిరి ప్రధాన శాస్త్రవేత్తకు అరుదైన గుర్తింపు లభించడంతో తోటి శాస్త్రవేత్తలు ప్రసన్న, రాజేష్, డాక్టర్ వేమన, డాక్టర్ నీలిమ, డాక్టర్ వెంకటరమణ, సిబ్బంది ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు



శాస్త్రవేత్త డాక్టర్ సంపత్‌కుమార్

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి:కదిరి

O.S.No.617/2022

Between:

1) బండ్లపల్లి మల్లిరెడ్డి S/o బి.చిన్నపరెడ్డి R/o తోటవాండ్లపల్లి, H/o నూతన కాలవ, తలుపుల మం॥ శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది

మరియు

2) ఎం.చంద్రమోహన్‌రెడ్డి S/o ఎం.రామచంద్రారెడ్డి R/o ముండ్లవాండ్లపల్లి H/o ధనియని చెర్వు, ఎన్.పి.కుంట మం॥. ...ప్రతివాది

ఇందుమూలముగా ప్రతివాది అయిన నీకు తెలియజేయడం ఏమనగా వాది అయిన బండ్లపల్లి మల్లిరెడ్డి ప్రాంసరీ బాకీ నిమిత్తము నీపై పై కోర్టు నందు బాకీ వసూలుకై పై కోర్టు నందు దావా వేసియున్నారు. పైదావా వాయిదా 30-1-2023వ తేదిన నీ హాజరు నిమిత్తము ఉన్నది. ప్రతివాది అయిన నీవు పై కోర్టు నందు ఉ॥10.30 గం॥లకు హాజరు కావలెను. అట్లు హాజరు కాని యెడల నీ పరోక్షమున కోర్టువారు నిర్ణయము తీసుకొందురు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:30-01-2023.

ఎస్.శివశంకర్‌రెడ్డి
వాదిపరం వకీలు, కదిరి.